రాబడి

ద్రవ్యసమీక్షపైనే..

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



మదుపుతోనే గెలుపు





నేడు మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్లైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

రోజులు మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

క్రిప్టో సిప్స్

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.

కాగజ్‌నగర్ : పూర్వ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మందమర్రి రూరల్ : పొన్నారం పాఠశాలలో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హాజీపూర్ : ఉపాధ్యాయులతో హాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

తాండూర్, జూన్ 1 : తాండూర్ జడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు అ 'పూర్వ' సమ్మేళనం ద్వారా ఒక్క చోట చేరారు. మండల కేంద్రంలోని సురభి మినీ ఫంక్షన్ హాలులో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడిగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు,శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

హాజీపూర్ జడ్పీహెచ్ఎస్‌లో..

హాజీపూర్, జూన్ 1 : హాజీపూర్ జడ్పీహెచ్ఎస్ 2007-08 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆ పాఠశాలలో నిర్వహించారు. తరగతి గదుల్లోకి వెళ్లి, గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను శాలువా, పూలమాలతో సన్మానించారు. అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, ఉపాధ్యాయులు కముటం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్తులు పాల్గొన్నారు.

పొన్నారం జడ్పీహెచ్ఎస్‌లో..

మందమర్రి రూరల్, జూన్ 1 : మందమర్రి మండలం పొన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. పాఠశాల వీడి ఉన్నత చదువులు చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒక్కచోట చేరి, పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులు రవి, శ్రీనివాస్, నగేశ్, రామ్‌చందర్, తిరుమలను సన్మానించారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్, జూన్ 1 : కాగజనగర్ పట్టణంలోని బాలభారతీ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఇందిరాతో పాటు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్వప్న, హరీశ్, కృష్ణా, సందీప్, గణేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: గురువులతో తాండూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వవిద్యార్థులు

పత్తి లిప్టింగ్‌కు లారీలు అనుమతించాలి

సీసీసీ నస్పూర్, జూన్ 1 : పత్తి లిప్టింగ్‌కు సీసీఐ అధికారులు తమ లారీలను అనుమతించాలని కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా సురేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాందేని రమేశ్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని గోదాముల వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీసీఐ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. గతంలో గోదాముల నుంచి తామే పత్తి బేళ్లను లిప్టింగ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం అధికారులు తమ లారీలను కాదని తమిళనాడు నుంచి తెప్పించుకొని గోదాముల్లోని పత్తి బేళ్ల లిప్టింగ్ చేయడం అన్యాయమన్నారు. ఆ లారీలను అడ్డుకుంటే సీసీఐ అధికారులు తమపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, తమ జీవనోపాధి దెబ్బతినకుండా తమ అసోసియేషన్ లారీల్లోనే లోడ్ చేయించాలని కోరారు. లేకపోతే నిరహార దీక్షలు చేపడుతామని స్పష్టం చేశారు. ఉపాధ్యక్షుడు భాస్కర్ల సుమన్, సంయుక్త కార్యదర్శి రమేశ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ గోదాముల వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

చెట్లు నరికినా పట్టించుకునే వారులేరు!

నరికివేసిన వేప చెట్టు

హాజీపూర్, జూన్ 1 : కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా ఏటా గ్రామగ్రామాన మొక్కలు నాటించింది. అవి ఏపుగా పెరిగి, ఆహ్లాదానిన పంచుతున్నాయి. కాగా, హాజీపూర్ మండలం దొనబండ జీపీ పరిధి జాతీయ రహదారి 63 ఆటో స్టాండ్ ప్రాంతంలో నాటిన ఓ వేప చెట్టును సమీప దుకాణా యజమాని నరికివేశాడు. కొమ్మలు దుకాణానికి అడ్డుగా వస్తున్నాయని చెట్టును మధ్యలోకి కొట్టేశాడు. చెట్లను పెంచి పోశించాల్సింది పోయి నరికేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతీయ రహదారి గుండా నిత్యం లక్షెట్టిపేట ఫారెస్ట్ అధికారులు జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. అయినా పట్టించుకోడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడోరోజూ పోడు రైతుల నిరసన

పెంచికల్‌పేట్, జూన్ 1 : బెజ్జూర్ రేంజ్ పరిధిలోని జైహింద్‌పూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ శాఖ అధికారులను అడ్డుకొని రైతులు నిర్వహిస్తున్న దీక్ష మూడో రోజుకు చేరింది. శనివారం రాత్రి రైతు దరి నగేశ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కూడా అధికారులు అక్కడి నుంచి వెళ్లకపోవడంతో పోడు రైతులు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు అధికారులు మొక్కలు నాటి తమకు అన్యాయం చేయద్దన్నారు. ఈ భూముల కోసం ఎన్ని రోజులైనా ఇక్కడే ఉంటూ నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. అధికారులు మొక్కలు నాటకుండా తమ భూములను వదిలి వెళ్లే దాకా ఇక్కడి నుంచి కదిలేదిలేదని తెలిపారు. ఆ భూములే తమ జీవనాధారమని పేర్కొన్నారు.

అవస్థకు గురైన రైతు నాగేష్

ఉపాధ్యాయుల సర్దుబాటు సమంజసం కాదు

నస్పూర్, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతామని చెప్పిన ప్రభుత్వం మే 28న 1267 అనే ప్రొసీడింగ్‌ను విడుదల చేస్తూ ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బట్టారి వెంకటేశ్వర్లు, చీపెల్లి బాపు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అభ్యాసన సామర్థ్యాలు పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరిట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేసేందుకు పూనుకోవడం సరైంది కాదన్నారు. పాఠశాలలు ప్రారంభం కాకుండానే విద్యార్థుల నమోదు పట్టించుకోకుండా జూన్ 12 నాటికి సర్దుబాటు చేయాలని చెప్పడం సహేతుకం కాదని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

చలో కొత్తగూడెం వాల్ పోస్టర్ విడుదల

శ్రీరాంపూర్, జూన్ 1 : సింగరేణి కార్మికుల మెరుగైన వైద్యసేవల కోసం 4న టీబీజీకేఎస్ చేపడుతున్న చలో కొత్తగూడెం దీక్షకు కార్మికులు తరలిరావాలని యూనియన్ పిట్ కార్యదర్శి బానోత్‌రాజునాయక్, డివిజన్ నాయకులు తొంగల రమేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఆర్కే 7 గనిపై ఆదివారం సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే పోస్టర్లు అంటించారు. యాజమాన్యం సంస్థ లాభాలను ఇతర జిల్లాలకు మళ్లిస్తూ కార్మికుల ఆరోగ్యాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. వెంటనే కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రీజియన్‌కు ఒక కార్పొరేట్ దవాఖాన నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పాదం శ్రీనివాస్, నాయకులు మిట్ట రాజేందర్, కోశాధికారి కొవ్వూరి ప్రతాప్, టెంపుల్ కమిటీ మాజీ సభ్యుడు కత్తి రాకేశ్, ఏ రిలే షిఫ్ట్ సెక్రటరీ నర్సింగం, పిడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పెట్టాలి

శ్రీరాంపూర్, జూన్ 1 : బొగ్గు గని కార్మికుల సవరించిన క్యాడర్ స్కీంపై చర్చించేందుకు కోల్‌కతాలోని కోలిండియా హెడ్డాఫీస్‌లో ఈ నెల 6న యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో నిర్వహించే జేబీసీసీఐ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో రిటైర్డ్ కార్మికుల సమస్యలు పెట్టాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచందర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత డిసెంబర్‌లో జరిగిన సమావేశంలో మినిట్స్ 8వ అంశంలో అధికారులకు 2017 జనవరి నుంచి రూ.20 లక్షల గ్రాడ్యూటీ సీలింగ్ అమలు పర్చినట్లుగానే రిటైర్డ్ ఉద్యోగులకూ అదే తేదీ నుంచి అమలుపర్చాలని డ్రాఫ్ట్ చేయడం జరుగనుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యను ఎజెండాలో పొందుపర్చి, చర్చించి త్వరగా అమలుపర్చాలని కోరారు.